



శివ జిన్నింగ్ మిలులో పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

వ్యాపారులకు కాసులు.. రైతులకు కన్నీళ్లు...

ఉల్లి క్వింటా
రూ. 600 నుండి రూ.900 కొనుగోలు

పెట్టుబడులు కూడా రాక
అప్పల ఊబిలోకి రైతులు

బహిరంగ మార్కెట్‌లో
కిలో రూ. 20 పైనే విక్రయం



వెంకటగిరి గ్రామంలో ఉన్న తిప్ప మీద ఉల్లిని కొనుగోలు చేస్తున్న వ్యాపారస్తులు

ఉల్లి వ్యాపారులకు కాసులు కురిపిస్తుంది.. రైతులకు మాత్రం కన్నీళ్లు తెప్పిస్తుంది.. రైతుల వద్ద వ్యాపారులు క్వింటా రూ. 600 నుండి రూ. 900 వరకు కొనుగోలు చేస్తున్నారు. అదే ఉల్లిని బహిరంగ మార్కెట్‌లో ప్రజలకు కిలో రూ. 20 నుండి 25 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. సేద్యం తప్ప మరొక పని తెలియని రైతులు ఇటు ప్రకృతి ప్రకోపానికి, అటు వ్యాపారుల దోపిడీకి కకావికలం అవుతున్నారు. మొన్నటి వరకు అధిక వర్షాలతో అష్టకష్టాలు పడిన రైతులు మొంథా తుఫాన్‌తో మరింత కష్టాల్లోకి కూరుకుపోయారు. వచ్చిన అరకొర ఉల్లి దిగుబడులకు క్వింటా ఇప్పటి వరకు కనీసం రూ.1000 కూడా దాటని పరిస్థితి ఉంది.

ప్రజాశక్తి - కోడుమూరు

కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామంలో వర్షాధారంగా అధిక విస్తీర్ణంలో ఉల్లి పంటను సాగు చేస్తారు. ఉల్లి పంట సాగులో జిల్లాలోనే వెంకటగిరి గ్రామం ప్రథమస్థానం. సొంత పొలంతో పాటు మరికొంత పొలాన్ని కౌలకు తీసుకొని ఉల్లి పంటను సాగు చేస్తుంటారు. ఈ సంవత్సరం వెంకటగిరి గ్రామంలో 2,000 ఎకరాలకు పైగా ఉల్లి పంటను సాగు చేశారు. గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని ఉల్లి పంట సాగు చేశాడు. పంటకు సుమారు 5 లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టాడు. మంచి లాభం వస్తుందని ఆశించగా పంట కోత సమయంలో మార్కెట్లో పరిస్థితి తల కిందులైంది. ఉల్లి ధర కేవలం క్వింటా రూ.600 నుంచి రూ.900 మాత్రమే పలుకుతుండడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఉల్లి పంట కోత కోయడానికి, గ్రేడింగ్ చేయడానికి, మార్కెట్‌కు తరలించడానికి ఎకరాకు మళ్లీ రూ.15,000 వరకు అదనంగా ఖర్చు అవుతుంది. ఉల్లికి కుళ్లిపోయే గుణం ఎక్కువ. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. గ్రేడింగ్ చేయడానికి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. గ్రేడింగ్ చేస్తేనే వ్యాపారులు కొంటారు. ఒకవైపు తుఫాను ప్రభావం, మరోవైపు ఉల్లి ధర పతనం కావడంతో దిగుబడులన్నీ పొలంలోనే కుళ్ళిపోతున్నాయి. మండలంలోని చాలా మంది రైతులు ఉల్లి గడ్డలు కుళ్ళిపోవడంతో పొలం గట్టుపైనే వదిలేస్తున్నారు. మరి కొందరుఉల్లిని తీయకుండానే పొలాల్లోనే దున్నివేస్తున్నారు. ఇంకొంతమంది పశువులకు మేతగా వేస్తున్నారు. పెట్టుబడిలో కనీసం 10 శాతం కూడా రాకపోవడంతో అన్నదాతలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

కౌలు రైతుల పరిస్థితి దయనీయం

ఉల్లికి గిట్టుబాటు ధర క్వింటాలుకు 1200 రూపాయలు ఇస్తామన్న ప్రభుత్వం దానిని రద్దు చేసి హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించింది. కానీ కౌలు రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారయింది. 90 శాతం మంది కౌలు రైతులకు కౌలు కార్డులు జారీ చేయలేదు. భూ యజమానులు కౌలుదారులకు ఒప్పంద పత్రం మీద సంతకాలు చేయలేదు. కౌలు రైతులకు కౌలుతో సహా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ కూలీల ఖర్చు భారీగా వ్యయం అవుతోంది. వీటన్నింటినీ భరించి పంట చేతికి వచ్చిన తర్వాత అమ్ముకోవాలన్నా సబ్సిడీ, విత్తనాలు, పంట బీమా, పంట రుణాలు ఏది వర్తించాలన్న కౌలు రైతులు అర్హత కార్డు తప్పనిసరి చేసింది ప్రభుత్వం. సొంత భూములు ఉన్న రైతులకు కనీసం ఆరకొరనైనా సాయం అందుతుంది కానీ కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కౌలు రైతులు దుక్కి దున్నడం దగ్గరి నుంచి పంట కోసి అమ్మే వరకు అనేక ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా వాటన్నింటినీ భరించినా ప్రభుత్వ సాయం ఉండదు. బీమా, మద్దతు ధర ఏదీ కూడా వీరికి వర్తించదు. భూ యజమానులు వ్యవసాయం చేయలేకపోతున్న ప్రస్తుత తరుణంలో కౌలు రైతుల పరిస్థితి మరింత దిగజారింది.

రూ. 4.8 లక్షలు అప్పులు మిగిలాయి



నేను 2 ఎకరాల సొంత పొలంతో పాటు 5 ఎకరాలను లక్ష రూపాయల కౌలుకు తీసుకొని ఉల్లి పంటను సాగు చేశాను. మొత్తం పెట్టుబడి రూ.6.6 లక్షలు పెట్టుబడి అయింది. ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 1 క్వింటా 900 రూపాయలకు అమ్ముడు పోయింది. ఈ లెక్కన ఈ సంవత్సరం రూ.4.8 లక్షలు అప్పులు మిగిలాయి. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రైతు పథకాలు వర్తింపచేయాలి.

- రైతు మద్దిలేటి, వెంకటగిరి గ్రామం.

కోత, గ్రేడింగ్ ఖర్చులు కూడా రావడం లేదు



ఈ ఏడాది నాకు ఉన్న 7 ఎకరాలతో పాటు అదనంగా మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకొని 11 ఎకరాలలో ఉల్లి పంటను సాగు చేశాను. పంట సాగుకు 10 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాను. అష్ట కష్టాలు పడి పంట పండిస్తే చేతికందే సమయంలో అతి వర్షం వల్ల 20 శాతం ఉల్లి కుళ్లిపోయింది. దీంతో 4 ఎకరాల ఉల్లి పంటను ధ్వంసం చేసి పప్పు శెనగ విత్తనం వేశాను. కౌలు రైతుల పథకాలు అందకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాల బారిన పడుతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- రైతు గూగన్న గారి గిడ్డయ్య, వెంకటగిరి గ్రామం.

ప్రభుత్వం ఆదుకోవాలి



జిల్లాలో దాదాపు 50 వేల మంది కౌలు రైతులు భూ యజమానుల, దేవాలయ భూములు, వక్ఫ్ భూములు సాగు చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది దళితులు, వెనుకబడిన కులాలకు సంబంధించిన వ్యవసాయ కూలీలు, చిన్న, సన్న కారు రైతులే ఉన్నారు. ఎకరాకు 20 వేల రూపాయల వరకు ముందస్తు కౌలు చెల్లించి పంట సాగు చేస్తున్నారు. అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు అందించాలి. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు 2019 కౌలు చట్టాన్ని రద్దు చేసి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పింది. అన్నదాత సుఖీభవ రూ.20,000 ఇస్తామని, పంటల రుణాలతో పాటు ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపజేస్తామని హామీ ఇచ్చి 16 నెలలు గడిచినప్పటికీ కొత్త చట్టం తీసుకురాలేదు.

- వెంకటేశులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు.

ప్రభుత్వం దృష్టికి పత్తి కొనుగోలు సమస్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పత్తి కొనుగోలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణ శివార్లలో ఉన్న పత్తి కొనుగోలు కేంద్రాన్ని శివ జిన్నింగ్ మిల్లును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ స్లాట్ బుకింగ్‌లో వస్తున్న సాంకేతిక సమస్యలు, తేమ శాతం వంటి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పత్తి తేమశాతం 20 శాతం వరకు సీసీఐ కొనుగోలు చేయాలని ఇప్పటికే లేఖ రాశామని చెప్పారు. ప్రస్తుతం 12 శాతం వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, 13 శాతం నుండి 14 శాతం తేమ ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలని సూచించామని పేర్కొన్నారు.

ఎమ్మిగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ : ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు వార్డుల్లో కలెక్టర్ పర్యటించి పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై పూర్తిగా ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఎంతమంది రోగులు అడ్మిట్ అవుతున్నారని, ఏఏ జబ్బులతో అడ్మిట్ అవుతున్నారని వైద్యులను ఆరా తీశారు.. రోజూ 30 నుండి 40 మంది రోగులు వస్తున్నారని, అందులో రోడ్డు ప్రమాదాలు, కుక్క కాటు, పాము కాటు, జ్వరం, దగ్గు, ఆయాసం వంటి కేసులు అధికంగా ఉన్నాయని వైద్య సిబ్బంది కలెక్టర్‌కి వివరించారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎమ్మిగనూరు తహసిల్దార్ శేషఫణి, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు..

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కలెక్టర్ : పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడున్న వారిని భోజన నాణ్యతపై, శుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విశ్వశాంతి హోమ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే : పట్టణంలోని వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో 4వ రోజు జరిగిన హనుమాత్ సహిత సుబ్రహ్మణ్య హోమాలు, చండీ హోమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనం పొందారు.


సంక్షేమ బాలికల వసతి గృహాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కోడుమూరు : కోడుమూరులోని ఎస్‌సి, బిసి సంక్షేమ హాస్టళ్లను జిల్లా కలెక్టర్ ఎ.సిరి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినిలతో మాట్లాడి భోజనం నాణ్యత గురించి తెలుసుకున్నారు. హాస్టల్ లో సౌకర్యాలు ఎదురవుతున్న సమస్యలు, ఎంతమంది విద్యార్థులు ఉన్నారని ఆరా తీశారు. నాణ్యమైన భోజనం, శుద్ధ జలం అందించాలని ఎస్సీ హాస్టల్ వార్డెన్ శిరీష, బీసీ హాస్టల్ వార్డెన్ సాహినూర్ బేగంకు సూ చించారు. వసతి గృహాల నిర్వహణపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థినిలు ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పగా భవనంలో పై పెచ్చులు ఊడుతున్నాయని తెలియజేశారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థినిలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకుని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి

- బాలోత్సవ్ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రఘుబాబు, ధనుంజయ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని బాలోత్సవ్ కమిటీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రఘుబాబు, ధనుంజయలు పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. బి.క్యాంప్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా నాయకులు రమణారెడ్డి అధ్యక్షతన, కాకతీయ పాఠశాలలో జిల్లా నాయకులు సాయి ఉదయ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘుబాబు, ధనుంజయ, రిటైర్డ్ హెచ్‌ఎం కల్పన, జయలక్ష్మి మాట్లాడుతూ సైన్స్ గురించి చాలా పరిశోధనలు ప్రయోగాలు జరిగిన తరువాత దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని తెలిపారు. ఐజాక్ న్యూటన్, గెలీలియో, గురుత్వాకర్షణ శక్తిని కనుగొన్న తరువాతనే సైన్స్ శాస్త్రీయ రంగంలో ముందడుగు పడిందని, జవహర్ లాల్ నెహ్రూ తొలి ప్రధానిగా శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించారని తెలిపారు. చదువు భోదించే విద్యాలయాలను, సాంకేతిక విద్యాలయాలను ఆధునిక దేవాలయాలుగా పేర్కొన్నారని, అందుకే బాలల దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించామని తెలిపారు. రాబోయే కాలంలో విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చడం కోసం బాలోత్సవ కమిటీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సునీత కుమారి, కాకతీయ పాఠశాల ప్రిన్సిపాల్ రామస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలిన రెండు మట్టి మిద్దెలు

- కోడుమూరులో చేనేత కార్మికుడికి తృటిలో తప్పిన ప్రమాదం
- కోసిగిలో నిరాశ్రయురాలైన నిరుపేద వృద్ధురాలు

ప్రజాశక్తి - కోడుమూరు/కోసిగి

కోడుమూరు మండల కేంద్రంలో, కోసిగి గ్రామంలోని సిద్ధప్ప పాలెంలో మంగళవారం కురిసిన వర్షాలకు మట్టి మిద్దెలు కూలిపోయాయి. వివరాలు..

కోడుమూరులోని మెయిన్ బజార్ ఆంజనేయస్వామి గుడి వీధిలో చేనేత కార్మికుడు బండా రవి నివసిస్తున్నాడు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మట్టి మిద్దె బాగా తడిసి మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో మగ్గం నేస్తున్న బండా రవి మట్టి మిద్దె కూలుతున్నట్లు శబ్దం రావడంతో వెంటనే పక్కకు రావడంతో తృటిలో ప్రమాదం తప్పింది. మట్టి మిద్దె మగ్గం మీద పడడంతో ముడి సరుకులు, పట్టు జరీ సటలు, జాకార్డు, పింజర కుంట, పట్టు చీరలు మట్టిలో కలిసిపోయాయి. దాదాపుగా రెండు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని బండా రవి ఆవేదన చెందారు. విషయం తెలిసిన చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు జి.పి వీరన్న, ఎస్.గంగాధర్‌లు కూలిన రవి ఇంటిని పరిశీలించారు. నష్టపోయిన రవి కుటుంబానికి వెంటనే ప్రభుత్వం గృహం మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని, కొత్త మగ్గాలు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకు రుణాలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట శేఖర్, వెంకటేష్, బండ నాగరాజు, భాష ఉన్నారు.



కూలిన చేనేత కార్మికుడి మట్టి మిద్దె, పరిశీలిస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

కోసిగి : గ్రామంలోని సిద్ధప్ప పాలెంలో ఇంటి నెంబర్ 7/63లో నివాసముంటున్న నిరుపేద వృద్ధురాలు మందుల నరసమ్మ ఇల్లు మంగళవారం తెల్లవారుజామున కూలింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇల్లు కూలడంతో ఆమె నిరాశ్రయులయ్యారు. కట్టుకున్న ఇల్లు కళ్ల ముందే కూలిపోవడంతో నరసమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వృద్ధురాలిని ఆదుకోవాలని స్థానికులు కోరారు. మందుల నరసమ్మ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం ద్వారా కొత్త ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని తెలిపారు.

ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - సిబెళగల్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

బెళగల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్ రాజును మాజీ జడ్‌పిటిసి, టిడిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందాలని చంద్రశేఖర్ కోరారు. మండలంలో అసాంఘిక శక్తులు అధికంగా ఉందని, ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతయినా ఉందని తెలిపారు.


సాహిత్యకారులకు విశిష్ట సేవా పురస్కారాలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కర్నూలు జిల్లాలో సాహిత్య రంగంలో విశిష్ట సేవలందించిన కవులను కర్నూలు ఉత్సవ్ 2025లో భాగంగా టిజివి కళాక్షేత్రం విశిష్ట సేవా పురస్కారాలతో సన్మానించారు. మంగళవారం రాత్రి కర్నూలుకు చెందిన ప్రముఖ నవలాకారుడు ఎస్‌డివి.అజీజ్, బాల సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ హరికిషన్, కర్నాటి చంద్రమౌళిని, కవిగా, విమర్శకులుగా సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, గూడూరుకు చెందిన మునుస్వామి గనుమాల, కవి నవలాకారులు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, పత్తికొండకు చెందిన సవ్వప్పగారి ఈరన్న, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రంగనాథ రామచంద్ర రావు, నంద్యాలకు చెందిన డాక్టర్ గెలివి సహదేవుడు, పులకుర్తికి చెందిన ఆరేపల్లి వరలక్ష్మమ్మని సన్మానించారు. తేజ బృందంచే శాస్త్రీయ నృత్యం, మొలగవెల్లి కొట్టాల బృందంచే జానపద గీతాలు, బుర్రకథ, అన్నమయ్య కీర్తనలు, భవానిచే పౌరాణిక నాటకం చింతామణి అద్భుతంగా ప్రదర్శించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పౌరాణిక నాటక ప్రదర్శనలు జరిగాయి.

విద్యార్థినికి ఎమ్మెల్యే సన్మానం

ప్రజాశక్తి - వెల్దుర్తి



విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మాక్ అసెంబ్లీకి ఎంపికైన వెల్దుర్తి గురుకుల పాఠశాల విద్యార్థి గాయత్రిని మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాం కుమార్ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన చట్టసభలు ఎలా నడుస్తాయో భావితరాలకు తెలియాలంటే మాక్ అసెంబ్లీలు వంటివి అవసరమని తెలిపారు. సభా పద్ధతులను ప్రత్యక్షంగా చూపిస్తూ, చిన్నప్పటి నుంచే ప్రజాస్వామ్య విలువలను విద్యార్థులకు నేర్పించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాక్ అసెంబ్లీ చేపట్టారని చెప్పారు. మారుతున్న కాలానికి, టెక్నాలజీకి అనుకూలంగా విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే మహత్తర బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసూన, డాక్టర్ ఆర్.అరుణ, స్వర్ణ కుమారి పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- కమిషనర్ విశ్వనాథ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని కెసి కెనాల్ వినాయక ఘాట్ వద్ద బుధవారం జరగనున్న కార్తీక దీపోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ... కార్తీక దీపోత్సవం సందర్భంగా వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, ప్రజా సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఘాట్ ప్రాంగణంలో తగిన లైటింగ్, వేదిక, సౌండ్ సిస్టం, తాగునీరు, పారిశుధ్యం, గజ ఈతగాళ్లు వంటి భద్రత ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ విషయాల్లో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించా రు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా, సుందరమైన వాతావరణంలో కార్తీక దీపోత్సవం నిర్వహించేందుకు పనిచేయాలని తెలిపారు. అంతకుముందు కమిషనర్ క్యాంపు కార్యాలయంలో కార్తీక దీపోత్సవం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. దేవనగర్ వైపు వెళ్లే సిసి రహదారి పనులను పరిశీలించి, రోడ్డుకిరువైపులా గ్రీనరీ నాటాలని, ఆక్రమణలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఇన్‌ఛార్జీ ఎస్ఇ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఎంఇ మనోహర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, డిఇ గిరిరాజ్, గంగాధర్, ఎఇ భాను పాల్గొన్నారు.



కార్తీక దీపోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ మల్లేష్

ఎకరాకు పది క్వింటాళ్ల పత్తి కొనుగోలు : ఎఒ

ప్రజాశక్తి - సిబెళగల్

ఎకరాకు పది క్వింటాళ్ల పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని ఎఒ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రైతులతో సమీక్షించి పత్తి కొనుగోలు పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్వింటా రూ.8,010 నుంచి రూ.8,100 వరకు మద్దతు ధర ప్రకటించిందని, సహజ తేమ ఉన్నా కొనుగోలు చేస్తారని తెలిపారు. అసహజ తేమ పత్తిని తీసుకోరన్నారు. రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, నవంబర్ తర్వాత ఎకరా అనే నిబంధన లేకుండా పత్తి కొనుగోలు జరుగుతుందని తెలిపారు.

నన్నూరు పిహెచ్‌సిలో ఆశాడే

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు పాల్గొని మాట్లాడారు. జన్మనిచ్చిన ఏ తల్లి చనిపోకూడదని, జన్మించిన ఏ శిశువు మరణించకూడదనే నినాదంతో ఆరోగ్య సేవలు అందించాలని తెలిపారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవమయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులకు పోషకాహారంపై, రక్తహీనతపై, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. చిన్న పిల్లల్లో నిమోనియా, తక్కువ బరువుతో పుట్టడం, శ్వాస ఆడకపోవడం, శరీర ఉష్ణోగ్రతలు సక్రమంగా ఉండకపోవడం, పోషకాహార లోపంతో బాధపడే వారిని కర్నూలు ప్రభుత్వాస్పత్రిలోని పౌష్టికాహార పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వైద్యులు డాక్టర్ నాగరాజు, సామాజిక ఆరోగ్య అధికారి రాధామోహన్, క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు ప్రభాకర్ రెడ్డి, మోహన్, ఆనమ్మ, విజయలక్ష్మి, ఎస్తేర్ రాణి, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

మోతాదుకు మించి పురుగు మందులు వాడొద్దు : ఎఒ

ప్రజాశక్తి-కోడుమూరు

పురుగు మందులు మోతాదుకు మించి పిచికారి చేస్తే లాభాల కన్నా నష్టాలు ఎక్కువగా ఉంటాయని ఎఒ రవి ప్రకాష్ తెలిపారు. మంగళవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పంట చేతికొచ్చేలోపు నాలుగు సార్లు మందులు పిచికారి చేస్తే చాలని, ఎక్కువసార్లు పిచికారి చేయడం వల్ల ఖర్చులు పెరగడంతో పాటు పంట దిగుబడులు తగ్గుతాయని హెచ్చరించారు. కంది పంటలో పురుగును గమనించి, పచ్చ పురుగు కానీ, లద్దె పురుగు కానీ తక్కువ మోతాదులో ఉన్నందున రైతులు ఖరీదైన మందులు స్ప్రే చేయకుండా పెట్టుబడి తగ్గించుకోవాలని సూచించారు. అలాగే పచ్చ పరుగు, లద్దె పురుగు నివారణకు ఎకరాకు 100 గ్రాముల ఇమామిక్టన్ బెంజోడు స్ప్రే చేయాలని తెలిపారు. కంది పంటలో 13-0-45 రకం మైక్రో న్యూట్రియెంట్ ఎకరాకు కిలో చొప్పున స్ప్రే చేసుకుంటే పూత రాలకుండా, కాయ నాణ్యత పెరుగుతుందని చెప్పారు. ఎక్కడైనా ఎండు తెగులు కనిపిస్తే కాపర్ ఆక్సి క్లోరైడ్ ఎకరాకు 500 గ్రాములు డ్రెంచింగ్ చేసుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎఒ రవి ప్రకాష్

యాజమాన్యం, అధికారుల తప్పిదం

- తల్లికి వందనానికి విద్యార్థి దూరం

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరులోని శ్రీచైతన్య ప్రయివేట్ పాఠశాల, ప్రభుత్వ అధికారుల తప్పిదాలతో తన కొడుకు మంజునాథ్‌కు 'తల్లికి వందనం' పథకం రాలేదని ఆలూరుకు చెందిన వేదవతి తెలిపారు. మంగళవారం ఆమె ఎంఇఒ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు ఎం.మంజునాథ్‌ను శ్రీచైతన్య పాఠశాలలో యుకెజిలో చేర్పించి, తర్వాత సెయింట్ జాన్స్ ప్రయివేట్ పాఠశాలలో చేర్పించామని తెలిపారు. ప్రస్తుతం 3వ తరగతి చదువుతున్న మంజునాథ్ పేరు చైతన్య పాఠశాలలో చదువుతున్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 'తల్లికి వందనం' ఇద్దరు కూతుళ్లకు వచ్చి కొడుకుకు రాకపోవడంతో విచారించినట్లు తెలిపారు. శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం చేసిన తప్పని ఎంఆర్‌సి అధికారులు చెప్పారని, ఎంఆర్‌సి అధికారులు తప్పు చేశారని శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం ఒకరిపై ఒకరు చెబుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించకుండా తిప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యను పరిష్కరించి 'తల్లికి వందనం'తో పాటు తన కుమారుని విద్యాభ్యాసానికి సమస్య రాకుండా చూడాలని కోరారు. ఇలాంటి సమస్యలతో 'తల్లికి వందనం' పథకానికి దూరమైన విద్యార్థులు మండలంలో 60 మందికి పైగానే ఉన్నారని తెలిసింది. జిల్లా ఉన్నతాధికారులు విచారించి పాఠశాల యాజమాన్యం, అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న విద్యార్థి తల్లి వేదవతి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్యామ్ కుమార్

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పత్తికొండ

నియోజకవర్గంలోని పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాలకు చెందిన పలువురు బాధితులకు ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మంగళవారం పత్తికొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు రూ.29.30 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలు అనారోగ్యానికి గురైతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా నిలుస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి కూడా సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తున్నారని తెలిపారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి

- ఎమ్మెల్యే కెఇకి సర్పంచి రవి మోహన్ వినతి

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

మండలంలోని బొంతిరాళ్ల గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని సర్పంచి రవిమోహన్ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్‌ను కోరారు. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్ బొంతిరాళ్ల గ్రామానికి వచ్చారు. సర్పంచి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన పంచాయతీ అభివృద్ధి పథంలో నడవడానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఎస్సీ కాలనీలో సిసి రోడ్లు, ప్రాథమిక పాఠశాల నుంచి నవినే పాటయ్య స్వామి వరకు సిసి రోడ్డు, దొనబొండ ఏరియాలో సిసి రోడ్డు, గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు, హంద్రీనీవా నీటిని ప్రజలకు అందించేందుకు అధికారులతో మాట్లాడి నిధులు కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు విడుదల చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మల్లికార్జున, మాబాష పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి రవిమోహన్


బస్సును తోస్తున్న విద్యార్థులు, సిబ్బంది

మొరాయించిన స్కూల్ బస్సు
- బస్సును తోసిన విద్యార్థులు, సిబ్బంది

ప్రజాశక్తి - గోనెగండ్ల
రాష్ట్రవ్యాప్తంగా బస్సు ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణనష్టం జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులను సురక్షితంగా చేర్చాల్సిన ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు నిబంధనలు పాటించకుండా ఫిట్‌నెస్ లేని బస్సులతోనే సరిపుచ్చుతున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. మంగళవారం గోనెగండ్లలోని జీనియస్ గ్లోబల్ పాఠశాలకు చెందిన బస్సు సాయంత్రం పాఠశాల విడిచిన తర్వాత కులుమాల గ్రామానికి విద్యార్థులను తరలించింది. తిరిగి రెండో ట్రిప్‌లో గోనెగండ్ల నుంచి ఐరన్ బండ గ్రామానికి విద్యార్థులను తరలించడానికి పాఠశాల వద్దకు చేరుకోగానే బస్సు మొరాయించింది. బస్సు స్టార్ట్ చేసేందుకు విఫలం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు బస్సును తలో చేయి వేసి తోశారు. రవాణా శాఖాధికారులు వాహన చలానాలు పెండింగ్ ఉన్నాయని, బస్సు ఫిట్‌నెస్ లేదని చెప్పినప్పటికీ అదే బస్సుతో విద్యార్థులను తరలిస్తున్నారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై విద్యాశాఖాధికారులు, పోలీసు అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘం నాయకులు మద్దిలేటి డిమాండ్ చేశారు.

మెరుగైన సేవలందించాలి
- విద్యుత్ శాఖ ఎస్ఇ ప్రదీప్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని


నివాళులర్పిస్తున్న అధికారులు

విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండి సేవలు మెరుగుపడేలా ఉద్యోగులు చొరవ చూపాలని విద్యుత్ శాఖ కర్నూలు సూపరిటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ ప్రదీప్ కుమార్ సూచించారు. మంగళవారం విద్యుత్ భవన్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఎంఇఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ఇని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెలవారీగా విద్యుత్ బకాయిలు చెల్లింపు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు సకాలంలో స్పందించాలని తెలిపారు. ఆదోని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామ్మోహన్, అకౌంట్ ఆఫీసర్ రాఘవులు, అడిషనల్ డిప్యూటీ ఇంజినీర్లు పురుషోత్తం, సంతోష్, ఎఇ చెన్నయ్య, ఉల్లిగప్ప, ఎంఇఎఫ్ నాయకులు వీరరాజు ఉన్నారు.

రబీకి సాగునీరందేలా చూడాలి
- ఎల్‌ఎల్‌సి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పు సుల్తాన్

ప్రజాశక్తి - ఆదోని


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుంగభద్ర డ్యామ్ పరిధిలోని దిగువ కాలువ కింద సాగు చేస్తున్న రబీ పంటలకు సాగునీరందేలా చూడాలని ఎల్‌ఎల్‌సి ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ టిప్పు సుల్తాన్, తెలుగు రైతుసంఘం జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా కోరారు. మంగళవారం కలెక్టర్ డాక్టర్ సిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుంగభద్ర డ్యామ్‌లో నీరు పుష్కలంగా ఉందని, రెండో పంట సాగు చేస్తున్న రైతులకు మార్చి నెలాఖరు వరకు నీరు విడుదల చేస్తే వారికి మేలు చేకూరుతుందని తెలిపారు. అధిక వర్షాల వల్ల ఇప్పటికే ఖరీఫ్ పంటలు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. కనీసం మార్చి చివరి వరకు సాగునీరు ఇస్తే రైతులు కోలుకుంటారన్నారు.

ముగిసిన అంగన్వాడీ ఇంటర్వ్యూలు
ప్రజాశక్తి - ఆదోని
ఆదోని డివిజన్ పరిధిలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు పూర్తయ్యాయని ఇన్‌ఛార్జీ సబ్ కలెక్టర్ టి.అజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఆయా మండలాల అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్ పోస్టుల కోసం రెండు ఖాళీలకు 15 మంది దరఖాస్తులు చేసుకోగా అందరూ హాజరయ్యారని తెలిపారు. హెల్పర్ పోస్టుల కోసం 26 ఖాళీలకు 62 మంది దరఖాస్తు చేసుకోగా, 56 మంది మాత్రమే ఇంటర్వ్యూకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు సాఫీగా ముగిసినట్లు వెల్లడించారు.

ఎకరాకు రూ.50 వేల పరిహారమివ్వాలి
• వామపక్ష నాయకులు • మండల సర్వసభ్య సమావేశం అడ్డగింత • వామపక్షాల ఆధ్వర్యంలో బైఠాయింపు, ముట్టడి • వైసిపి మద్దతు

ప్రజాశక్తి - దేవనకొండ
అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.50 వేలు పరిహారంగా చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసరావు డిమాండ్ చేశారు. మంగళవారం దేవనకొండ మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం గేటు ముందు వామపక్షాల ఆధ్వర్యంలో వామపక్ష, ప్రజాసంఘాల కార్యకర్తలు బైఠాయించారు. అంతకుముందు రైతులతో కలిసి ర్యాలీ, ధర్నా చేపట్టారు. రైతుసంఘం నాయకులు సూరి సంజన్న అధ్యక్షత వహించారు. వైసిపి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఎమ్మెల్యే బి.విరుపాక్షి, జడ్‌పిటిసి రామకృష్ణ, ఎంపిపి లక్ష్మీదేవి, ఎంపిపి భర్త లుముంబా ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడారు. మండలంలో కురిసిన అధిక వర్షాల కారణంగా రైతులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు రూ.వేలకు వేలు అప్పులు చేసి ఉల్లి, పత్తి, కంది, ఆముదం, టమోటా తదితర పంటలు సాగు చేశారని, అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.90 వేల వరకు పెట్టుబడులు పెట్టారని, అధిక వర్షాల వల్ల నష్టపోయారని చెప్పారు. పంట పొలాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై మండల అధ్యక్షులు, ఎఒ, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

నియోజకవర్గమంతా కరువే
- ఎమ్మెల్యే విరుపాక్షి
వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం మొత్తంగా కరువు బారిన పడిందని, రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మాటలు చెబుతూ కాలాన్ని వృథా చేస్తోందని ఎమ్మెల్యే బి.విరుపాక్షి విమర్శించారు. రైతులకు సంబంధించిన కార్యక్రమంలో వైసిపి ఎప్పుడూ ప్రత్యక్షంగా పాల్గొంటుందని, రైతులకు అన్యాయం జరిగితే కమ్యూనిస్టులతో పాటు తాము కూడా రోడ్లెక్కుతామని హెచ్చరించారు. సిపిఎం, సిపిఐ నాయకులు కండప్ప, బజారి, శేఖర్, అశోక్, యూసుఫ్, మహబూబ్ బాషా, నాగేష్, నరసింహులు, రాజశేఖర్, రంగస్వామి, రామాంజి, తెర్నేకల్ సుధాకర్, వీరస్వామి, రాయుడు, కెపి.రాముడు, అనిల్, హనుమప్ప, రఫీ, వీరాంజి, కోమేష్, రవీంద్ర, లింగన్న, భాస్కర్, దస్తగిరి, సుబ్బయ్య, యూనుస్, మనోహర్, శంకర్, మస్తాన్, వీరేష్ పాల్గొన్నారు.


ఎంపిడిఒ కార్యాలయం ఎదుట బైఠాయించిన వామపక్ష నాయకులు, ఎమ్మెల్యే విరుపాక్షి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి మాధవరావు దేశాయ్ పరామర్శ
ప్రజాశక్తి - నందవరం
టిడిపి కార్యకర్త ఆరెకంటి హుస్సేని కుటుంబాన్ని మాధవరావు దేశాయ్ మంగళవారం పరామర్శించారు. హుస్సేని తల్లి ఆరెకంటి అరుణమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధవరావు దేశాయ్ వారి నివాసానికి చేసుకుని మృతదేహానికి నివాళు లర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. తిమ్మరాజు, షరీఫ్, శ్రీనివాసులు, ఈరన్న, బతుకన్న, సురేష్, జయన్న, ముఖన్న, పక్కీరప్ప, పృథ్వీరాజ్, విజయ్, సామ్యేల్ పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాధవరావు దేశాయ్

ఎస్టీ సాధనకు 'దృఢ సంకల్ప దీక్ష'
- ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మన్న, ఎపి విబిఎస్ రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి నాయుడు

ప్రజాశక్తి - మంత్రాలయం
వాల్మీకుల చిరకాల వాంఛ ఎస్టీ సాధనకు చేపట్టనున్న 'దృఢ సంకల్ప దీక్ష'కు వాల్మీలంతా పార్టీలకతీతంగా మద్దతు ఇవ్వాలని రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మన్న, ఎపి విబిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు కోరారు. మంగళవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో లక్ష్మన్న స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాల్మీలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరికి నిరసనగా 2025 మందితో కర్నూలులో వాల్మీకుల 'దృఢ సంకల్ప దీక్ష' చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాల్మీకి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలోనూ వాల్మీకి భవనాలు ఏర్పాటు చేయాలని, వాల్మీకి నిరుద్యోగుల కోసం ఒక ఆర్మీ సెక్యూరిటీ లేదా రెజిమెంట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎపి విబిఎస్ రాష్ట్ర కార్యదర్శి రామానాయుడు, ఆదోని డివిజన్ అధ్యక్షులు బోయ వీరేష్, మంత్రాలయం తాలూకా అధ్యక్షులు సూగూరు నరసింహులు, మండల సీనియర్ నాయకులు భీమన్న, మహేష్ పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

రైతులను ఆదుకునేందుకు చర్యలు
- ఎమ్మెల్యే విరుపాక్షి
- మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- దేవనకొండ
అధిక వర్షాల వల్ల నష్టపోయిన మండల రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విరుపాక్షి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి లక్ష్మీదేవి అధ్యక్షతన ఎంపిడిఒ జ్యోతి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ... సర్పంచులు, ఎంపిటిసిలు గ్రామాల్లోని సమస్యలను అధికారులు దృష్టికి తెచ్చినప్పుడే పరిష్కారం అవుతాయని తెలిపారు. ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిని సస్పెండ్ చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తనవంతుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఎంపిపి లక్ష్మీదేవి మాట్లాడుతూ... మండలంలోని ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. ఎంపిడిఒ జ్యోతి మాట్లాడుతూ... అతివృష్టి వల్ల పత్తి, ఉల్లి పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయారని, ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బి అధికారులు రెండు సర్వసభ్య సమావేశాలకు హాజరు కాకపోవడంతో షోకాజు నోటీసులు జారీ చేస్తామన్నారు. ఎఒ ఉషారాణి మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్‌లో 75 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారని, అధికంగా పత్తిని సాగు చేశారని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో 30 శాతం వర్షపాతం అధికంగా నమోదయిందని, మండలంలో 3,824 ఎకరాల్లో ఉల్లి పంట నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వానికి నివేదిక అందించామన్నారు. త్వరలోనే ఉల్లి రైతులకు డబ్బులు జమవుతాయని పేర్కొన్నారు. తహశీల్దార్ సుదర్శనం మాట్లాడుతూ... మండలంలోని 25 వేల రైస్ కార్డులు ఉండగా లబ్ధిదారులకు స్మార్ట్ కార్డు రైస్ కార్డులను పంపిణీ చేశామని తెలిపారు. మండలంలోని భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో అవగాహన లోపం వల్ల తప్పులు జరిగాయని చెప్పారు. వైసిపి ఎంపిటిసి తపాల శ్రీనివాసులు సర్వసభ్య సమావేశంలో రాజకీయం గురించి మాట్లాడడంతో టిడిపి ఎంపిటిసి విజయభాస్కర్ గౌడ్ తప్పుపడుతూ... ఇది రాజకీయ సమావేశం కాదని, ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని తెలిపారు. జడ్‌పిటిసి కిట్టు, డిప్యూటీ ఎంపిడిఒ గోపాల్, పంచాయతీరాజ్ ఎఇ ఉదయ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీమోహన్, ఎంఇఒలు తిమ్మారెడ్డి, విజయనిర్మల దేవి, ఏపీవో రాజు నాయక్, ఎపిఎం మాధుల లక్ష్మమ్మ, పశు వైద్యాధికారి వెంకటేష్, ఆర్ఐ విజయభాస్కర్, సిహెచ్ఒ భాగ్యలక్ష్మి, మైనర్ ఇరిగేషన్ అధికారి సోమన్న, ఎంపిటిసిలు తిమ్మప్ప, లక్ష్మీదేవి, రాముడు, ఉషారాణి, సర్పంచులు అరుణ్ కుమార్, శేషి రెడ్డి, చిన్న రామప్ప, నాగరాజ్ గౌడ్, మహేశ్వర్ రెడ్డి, నరసింహయ్య స్వామి, మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు రఫీ, శివ శంకర్ సింగ్, తులసి మోహిని, సునీత, సతీష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి


ఆరతి తీస్తున్న ఎస్పీ

లక్ష దీపోత్సవంపై ఎస్పీ ఆరా
ప్రజాశక్తి - మంత్రాలయం
ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహించే లక్ష దీపోత్సవ ఏర్పాట్లపై ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆరా తీశారు. మంగళవారం శ్రీమఠం సహాయక పీఆర్‌ఒ హొన్నాళ్ వ్యాసరాజాచార్, ఎస్ఐ శివాంజల్, సిబ్బందితో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ఆయనకు శేష వస్త్రం, జ్ఞాపికను అందజేశారు. ఈనెల 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీమఠంలో జరగనున్న లక్ష దీపోత్సవంతో పాటు తుంగభద్ర నదీతీరంలో తుంగ హారతిలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ తగిన భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి
ప్రజాశక్తి-ఆలూరు


దేవేంద్రప్ప (ఫైల్)

మండలంలోని హులేబీడు గ్రామంలో కర్ణాటక వాహనం ఢీకొని మంగళవారం తలారి దేవేంద్రప్ప (45) అక్కడకక్కడే మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు... తుంబల బీడు గ్రామానికి చెందిన తలారి దేవేంద్రప్ప తన తల్లి గోవిందమ్మ తుంబలబీడు నుంచి హులేబీడుకు వచ్చారు. దేవేంద్రప్ప తన తల్లిని ఆదోని బస్సు ఎక్కించి తుంబలబీడుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆదోని నుంచి బళ్లారి వైపు వస్తున్న కర్ణాటకకు చెందిన వాహనం ఢీకొట్టగా దేవేంద్రప్ప అక్కడకక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ఆస్పత్రికి తరలించారు. వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పైసలిస్తేనే పాసు పుస్తకం...
- విఆర్ఒ చేతివాటం

ప్రజాశక్తి - పత్తికొండ
పైసలిస్తేనే పొలం పాసు పుస్తకం మంజూరు చేస్తున్నారు ఓ విఆర్ఒ. పత్తికొండ మండలం హోసూరు విఆర్ఒ చేతివాటం ప్రదర్శించారు. గ్రామానికి చెందిన కురువ హనుమన్న తనకున్న పొలానికి పాసు పుస్తకం కావాలని విఆర్ఒను సంప్రదించారు. పొలం డాక్యుమెంట్లను వెరిఫై చేసి రూ.3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తనకు అంత ఇచ్చే స్తోమత లేదని రైతు తెలిపారు. ఆఖరిగా రూ.1,500 ఇచ్చినట్లు చెప్పారు. రైతులు సాగు చేసిన పంటలు చేతికి రాక ఇబ్బందులు పడుతుంటే కొందరు విఆర్ఒలు రైతులను రాబంధుల్లా పీక్కుతింటున్నారని పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు రైతులకు ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థుల్లో సైన్స్ భావజాలం పెంపొందాలి
- జెవివి ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు
విద్యార్థుల్లో సైన్స్ భావజాలం పెంపొందాలని ప్రజా వైద్యులు, శాంతి నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ మాల కొండయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాయ్స్ ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు నాగభూషణం తెలిపారు. మంగళవారం జెవివి ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర పాఠశాలలో సైన్స్ సంబరాల్లో భాగంగా చెకుముకి మండల స్థాయి పోటీలను నిర్వహించారు. చెకుముకి ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులు, ప్రజా వైద్యులు మాల కొండయ్య మాట్లాడుతూ... నేటి విద్యార్థులే రేపటి పౌరులని, విద్యార్థులు దేనిని గుడ్డిగా నమ్మకుండా ప్రతి విషయం తార్కింగ ఆలోచించాలని తెలిపారు. విద్యార్థి దశ నుంచి పరిసరాలను నిశితంగా పరిశీలించి, చిన్న, చిన్న ప్రయోగాల ద్వారా సైన్స్‌ను నేర్చుకోవాలని సూచించారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య మాట్లాడుతూ... నేడు మనం విజ్ఞాన, సమాచార విస్ఫోటన యుగంలో జీవిస్తున్నామని, సమాజంలో అత్యధికులు మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. జెవివి సీనియర్ నాయకులు మాదన్న మాట్లాడుతూ... ఉన్నత చదువులు చదువుకున్న వ్యక్తుల్లోనూ ఇంకా మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు ఉన్నాయని, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు నారాయణ, భీమేష్ మాట్లాడుతూ... విద్యార్థుల జీవితాల్లో సైన్స్ ఒక భాగం కావాలని తెలిపారు. అనంతరం చెకుముకి మండల స్థాయి పరీక్షను నిర్వహించారు. పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విభాగంలో బాలికల ఉన్నత పాఠశాల టీం విద్యార్థినులు సుజాత, సింధు, హరిప్రియ, ప్రయివేట్ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానంలో గుడ్ షెఫర్డ్ టీం పవన్, సుధీర్ కుమార్, లక్ష్మీ ప్రణీతలు నిలిచారు. మండల విజేతలు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజేతలను ముఖ్య అతిథులు అభినందించారు. తర్వాత బహుమతులు అందజేశారు.

సైన్స్‌ను విస్తరించాలి : జెవివి నాయకులు
ప్రజాశక్తి - ఆదోని
ఆధునిక యుగంలో సాంకేతిక పరంగా విస్తరిస్తున్న నేపథ్యంలో సైన్స్‌ను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జెవివి నాయకులు రుద్రముని తెలిపారు. మంగళవారం ఆదోని నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు రాజా సతీష్ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ నాయుడు, సునీల్ రాజ్ కుమార్, మల్లికార్జున, జగన్మోహన్, ఇందిరా ప్రియదర్శిని, సుబేదమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా రుద్రముని మాట్లాడారు. జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పరీక్షలకు అర్హత పొందారన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో మూడు కేటగిరీలుగా విభజించి ఫలితాలు ప్రకటించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల కేటగిరిలో గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, రెసిడెన్షియల్ కేటగిరిలో మహాత్మ జ్యోతి పూలే రెసిడెన్షియల్ పాఠశాల ఆరెకల్, ప్రయివేట్ పాఠశాల కేటగిరిలో నేషనల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలకు అర్హత సాధించారని చెప్పారు.


ఎమ్మిగనూరులో విద్యార్థులతో అతిథులు, జెవివి నాయకులు


ఆదోనిలో బహుమతులు ఇస్తున్న నాయకులు

ఆర్‌ఎస్‌కెలో పేర్లు నమోదు చేసుకోవాలి : ఎఒ గణేష్
ప్రజాశక్తి - మంత్రాలయం
మండలంలో పత్తి సాగు చేసిన రైతులు పంటను అమ్ముకోవడానికి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని ఎఒ జీరా గణేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని కలుదేవకుంట, చిలుకలడోణ గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది', భూమాత కమిటీలకు శిక్షణ ఇచ్చిన అనంతరం పత్తి పంట దిగుబడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూముల సారం పెంపొందించడం, అక్రమ ఎరువుల అమ్మకం, రవాణా నియంత్రణ, మోతాదుకు మించి ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. మట్టి నమూనా సేకరణతో పరీక్షల తదుపరి ఫలితాల అనంతరం ఎరువుల వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎఇఒ తిరుమల రెడ్డి పాల్గొన్నారు. **నందవరం** మండలం ముగతి గ్రామంలో 'పొలం పిలుస్తోంది, భూమాత రక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎఒ సరిత మాట్లాడుతూ... రైతులు భూరక్షణకు సహజ ఎరువులను వినియోగించాలని తెలిపారు. రైతులు అధిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయ ఎరువులు ఉపయోగించి నేల ఆరోగ్యం కాపాడాలన్నారు. **చిప్పగిరి** మండ లంలోని దౌల్తాపురం, నంచర్ల గ్రామాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ వివేక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ మాట్లాడుతూ... ప్రతేడాది ఒకే పంటను వేయకుండా రకరకాల పంటలను సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. ఖరీఫ్‌లో వేసిన పంటలతో పాటు రబీలో వేసిన పప్పు శనగ పంటలను పరి శీలించారు.


మంత్రాలయంలో రైతులతో మాట్లాడుతున్న ఎఒ


నందవరంలో


చిప్పగిరిలో రైతులతో మాట్లాడుతున్న ఎఒ

'పత్తి రైతులను ఆదుకోవాలి'
ప్రజాశక్తి - ఆస్పరి
అధిక వర్షాల వల్ల పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, తాలూకా అధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... వర్షాల కారణంగా పత్తి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందజేయాలని కోరారు. రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 18, 19వ తేదీన ఆదోనిలో పత్తి రైతుల రాష్ట్రస్థాయి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు, పత్తి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, రైతుసంఘం మండల అధ్యక్షులు బడేసాబ్, ఉరుకుందప్ప, ఆంజనేయ, ఎఐటియుసి నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మార్చి 31లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- డిఆర్‌డిఎ పీడీ రమణారెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల


సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలను మార్చి 31లోపు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, డిఆర్‌డిఎ పీడీ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం గోనెగండ్లలోని ఎన్‌టిఆర్ గృహ నిర్మాణాల లేఅవుట్, గ్రామంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని హౌసింగ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద పాత పథకంలో 917 గృహాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయని, వాటని లబ్ధిదారులు 2026, మార్చి 31లోపు పూర్తి చేసుకోవాలని తెలిపారు. అందుకనుగుణంగా హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కూడా దశలవారీ లక్ష్యాలను ఇచ్చినట్లు చెప్పారు. మండలంలో నవంబర్ చివరి నాటికి 107 ఇళ్లను పూర్తి చేయాలని నిర్దేశించామన్నారు. అలాగే ప్రధానమంత్రి 2.0 గ్రామీణ పథకం కింద ఇళ్ల నిర్మాణాలకు అర్హులైన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకంలో కేంద్రం రూ.1.20 లక్షలు, ఉపాధి హామీ చట్టం కింద రూ.27 వేలు, స్వచ్ఛభారత్ పథకం ద్వారా రూ.12 వేలు మొత్తం రూ.1.59 లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. అర్హులైన వారు హౌసింగ్ సిబ్బంది సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిడిఒ మణిమంజరి, హౌసింగ్ పీడీ ఎస్‌వి.ప్రసాద్, ఎఇ షేక్షావలీ, ఏపీవో మహ్మద్ బాషా, ఎపిఎం హేమలత పాల్గొన్నారు.

హౌసింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి
ప్రజాశక్తి - నందవరం
మండలంలో మంజూరయిన ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని డిఆర్‌డిఎ పీడీ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇళ్ల నిర్మాణం పూర్తి కావడానికి కృషి చేయాలని తెలిపారు. ఇల్లు నిర్మించుకోవడానికి అడిషనల్ పేమెంట్ రూ.50 వేలు వస్తుందని, ఇల్లు కట్టుకుంటే విడతల వారీగా బిల్లు పడుతుందని ప్రతి లబ్ధిదారునికీ తెలపాలని సూచించారు. ఇంటి కోసం కొత్తగా దరఖాస్తు చేసుకుంటే స్వీకరించాలన్నారు. బేస్ మట్టం కట్టుకున్న వారికి అర్హత ఉంటే పరిశీలించి మంజూరు కోసం తీసుకోవాలని తెలిపారు. ఎంపిడిఒ పుల్లయ్య, డిప్యూటీ ఎంపిడిఒ సందీప్, హౌసింగ్ డిఇ ప్రసాద్, ఎఇ వెంకటేష్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళీ, కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు
ప్రజాశక్తి - నందవరం


ఎస్ఐని కలిసిన నాయకులు

నందవరం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తిమ్మారెడ్డిని ఎంఆర్‌పిఎస్ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. మండలంలో మాదిగల సమస్యలు మీ దృష్టికి వస్తే చట్టపరంగా తగిన న్యాయం చేయాలని కోరారు. అలాగే నందవరం జై భీమ్ ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు బుజ్జిబాబు, ఇన్‌ఛార్జీ చింపిరి చిన్న పోతప్ప, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శవాల సత్యానందం, మండల ప్రధాన కార్యదర్శి శవాల శాంతిరాజు, నాయకులు పరంపోగు వరాలు, పులిచింత గ్రామ అధ్యక్షులు పోతురాజు, భాస్కర్ పాల్గొన్నారు.